# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 09 మార్చి 2025 | www.balagamtv.com | పేజీలు 5




## అందరం ఏకం కావాలి




- తెలంగాణ ప్రయోజనాల కోసం అన్ని పార్టీలను కలుపుకుని పోరాడుదాం
- పెండింగ్ సమస్యలపై పార్లమెంటులో వాయిదా తీర్మానమిద్దాం
- అఖిల పక్ష ఎంపీల సమావేశంలో నిర్ణయం
- కేంద్రం నుండి రావాల్సిన నిధులపై చర్చ
- వివరాలు వెల్లడించిన డిప్యూటీ సీఎం భట్టి
- కాంగ్రెస్, ఎంఐఎం ఎంపీలు హాజరు
- బీజేపీ, బీఆర్ఎస్ గైర్హాజరు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం అందరం ఏకం కావాలని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి మన సమస్యలను వివరించాలని ఆఅన్నారు. ఉన్నత భావాలతో ఎంపీలతో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కేంద్రం నుండి రావాల్సిన నిధుల కోసం పోరాడాల్సి ఉందని ఆయన అన్నారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన తెలంగాణ ఎంపీల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కూడా హాజరయ్యారు. బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీలు గైర్హాజరయ్యారు.

భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఆ సమావేశంలో న్యాయబద్ధంగా రావాల్సిన పన్నుల వాటా, రాష్ట్రం నుంచి కేంద్రానికి వెళ్లుతున్న ఆదాయపు పన్ను, జీఎస్టీ, కస్టమ్స్ మొత్తం ఎంత, కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా రాష్ట్రానికి కలుగుతున్న లబ్ధి, కేంద్ర బడ్జెట్ నిధుల కేటాయింపులో ఎందుకు అన్యాయం జరుగుతోందనే అంశాలపై చర్చించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో పదేళ్లు బీఆర్ఎస్ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించిన భట్టి విక్రమార్క ఏడాదిగా తీవ్రంగా ప్రయత్నించినట్లు వెల్లడించారు. విభజన హామీలైన బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట వ్యాగన్ పరిశ్రమ, వరంగల్‌టెక్స్‌టైల్ పార్క్, మెట్రోవిస్తరణ, మూసీ ప్రక్షాళన సహా అనేక పథకాలకు కేంద్ర సహకారం అందట్లేదని భట్టివిక్రమార్క అసంతృప్తి వ్యక్తంచేశారు. రాష్ట్రానికి లబ్ధి కలిగేలా అవసరమైతే పార్లమెంట్ సమావేశాల్లో వాయిదా తీర్మానం ఇచ్చేఅవకాశాలను ఎంపీలకు వివరించినట్లు చెప్పారు.

కేంద్రం నుంచి న్యాయబద్ధంగా రావాల్సిన నిధులపై పార్లమెంట్‌లో ఎలా పోరాడాలి? అనుసరించాల్సిన వ్యూహాలపై ఎంపీలకు భట్టివిక్రమార్క పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఎంపీలకు వివరించారు. పార్లమెంట్ వేదికగా కేంద్రంపై ఒత్తిడితెచ్చేందుకు ఏ ఏ అంశాలు లేవనెత్తాలనేది విపులంగా బుక్‌లెట్ తయారుచేసి ఎంపీలకు అందించినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల అంశాన్ని లోక్‌సభలో లేవనెత్తుతానని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ స్పష్టంచేశారు.

**సమావేశానికి బీఆర్ఎస్, బీజేపీలు గైర్హాజరు**

ఈ సమావేశానికి బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీలు రాలేదు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు రాష్ట్రానికి సంబంధించిన ఎంపీలందరికీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుక్రవారం స్వయంగా ఫోన్ చేసి సమావేశానికి ఆహ్వానించారు. తమకు ఆహ్వానం ఆలస్యంగా అందిందనీ, పార్టీ కార్యక్రమాల కారణంగా ఎంపీల సమావేశానికి హాజరుకాలేమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి భట్టికి లేఖ రాశారు. భవిష్యత్‌లో ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తే.. ముందుగానే తెలియజేయాలని లేఖలో కోరారు. బీఆర్ఎస్ నుంచి మాత్రం ఇప్పటి వరకు అధికారికంగా ఎవరూ స్పందించలేదు. రాష్ట్రప్రయోజనాల దృష్ట్యా త్వరలో మరో సమావేశం నిర్వహిస్తామని అప్పుడైనా కమలం, గులాబీ ఎంపీలు రావాలని భట్టి విజ్ఞప్తిచేశారు.

## బస్సులకు ఆర్టీసీ సకాలంలో కిరాయి చెల్లిస్తుందా



- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.
- తెలంగాణ భవన్ లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మహిళా సంఘాల ద్వారా కిరాయికి తీసుకుంటున్న బస్సులకు ఆర్టీసీ సకాలంలో కిరాయి చెల్లిస్తుందో లేదో స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "మహిళా రిజర్వేషన్ చట్టాన్ని జనగణనతో ముడిపెట్టి ఇప్పటికీ కేంద్రం అమలు చేయడం లేదు మహిళా రిజర్వేషన్లు అమలు కానందువల్ల మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యానా వంటి ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో మహిళలు తీవ్రంగా నష్టపోయారు జనగణనకు బడ్జెట్ లో ఎందుకు నిధులు పెట్టలేదు?. త్వరగా జనగణన చేస్తే.. రాబోయే బీహార్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో మరింత మంది మహిళలు ఎమ్మెల్యేలు అవుతారు . ప్రతీ మహిళకు రూ.2500 ఇస్తామన్న హామీని అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతాం

మహిళా సంఘాల ద్వారా అద్దెకు తీసుకుంటున్న బస్సులకు ఆర్టీసీ సకాలంలో కిరాయి చెల్లిస్తుందా లేదా స్పష్టత ఇవ్వాలి. అంగన్ వాడీ, ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచకపోవడం సరికాదు . మహిళలను ఎలా కోటీశ్వరులను చేస్తారో నిర్దిష్టమైన ప్రణాళికను ప్రభుత్వం బహిర్గతం చేయాలి కేసీఆర్ గారు మహిళా కేంద్రీకృత పాలన చేశారు. మహిళల కోసం కేసీఆర్ అనేక పథకాలు, కార్యక్రమాలు చేపట్టారు

కేసీఆర్ పెట్టిన పథకాలను తీసేసే కర్కోటక ప్రభుత్వం రాష్ట్రంలో ఉంది. కేరళ ప్రభుత్వ పాఠ్య పుస్తకాల్లో మహిళ, పురుషల సమానత్వపు బొమ్మలు ప్రచురిస్తున్నారు. అలాంటి చర్యలు తెలంగాణలో కూడా రావాల్సి ఉంది. సమాజం ఎదుగుదలలో మహిళల పాత్ర గణనీయం. ప్రపంచ వ్యాప్తంగా మహిళలకు సమాన హక్కులు, గౌరవం, నిర్ణయాధికారం రావాల్సి ఉంది. అప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుంది చిట్యాల ఐలమ్మ, రాణి రుద్రమదేవి వంటి వీర మహిళలు తెలంగాణ గడ్డపై పుట్టడం మనకు గర్వకారణంమహిళలకు కులమతాలు లేవు.. మహిళలది ఒకే కులం. మహిళలు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలి. ఇళ్లలో మహిళలు ద్వితియ శ్రేణి పౌరులుగా ఉంటున్నారన్న వాదన వీగిపోవాలి. అమెరికాలో 40 శాతం మహిళలు ఉద్యోగాలు చేస్తుంటే భారత్ లో మాత్రం అది 17 శాతంగానే ఉంది. దేశంలో 50 శాతం మహిళలు ఉద్యోగాలు చేస్తే దేశ జీడీపీకి మనం రూ. 5 లక్షల కోట్ల ఆదాయం ఇవ్వగలుగుతాం. కానీ మహిళలు ఉద్యోగాలు చేయడానికి గల సౌకర్యాలు ఉన్నాయా? అన్నది ఆలోచించాలి. భూగర్భ గనుల్లో పనిచేయడం నుంచి అంతరిక్షంలోకి వెళ్లే వరకు మహిళలు ఎదిగారు. అయినా అనేక అవాంతరాలు ఉన్నాయి.. వాటిని అధిగమించాల్సిన అవసరం ఉంది.

## నిమ్స్‌లో విజయవంతంగా గుండె మార్పిడి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తీవ్రమైన గుండె జబ్బుతో బాధపడుతున్న 19 ఏండ్ల యువకుడికి, నిమ్స్ డాక్టర్లు పునర్జన్మను ప్రసాదించారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెత్ అయిన మరో యువకుడి గుండెను, ఈ హైదరాబాద్ యువకుడికి విజయవంతంగా ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. కార్డియో థొరాసిక్ సర్జరీ విభాగం హెచ్‌వోడీ, డాక్టర్ అమరేశ్ బాబు నేతత్వంలోని డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ టెక్నీషియన్ల బందం శుక్రవారం శస్త్ర చికిత్సను పూర్తి చేసింది. నగరంలోని రసూల్‌పురాకు చెందిన పూజారి అనిల్‌కుమార్ కొంత కాలంగా గుండె జబ్బుతో బాధపడుతున్నాడు.నిమ్స్ హాస్పిటల్‌లో హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం జీవన్‌దాన్‌లో రిజిస్టర్ చేసుకున్నాడు. కాగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన 24 ఏండ్ల యువకుడు నగరంలోని ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం బ్రెయిన్ డెడ్ అయ్యాడు.

మిగితా 4వ పేజీలో




# కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తాం

- మహిళా సంఘాలకు రైస్ మిల్లులు పెట్టించే బాధ్యత ప్రభుత్వానిది
- గోడౌన్లను కూడా..
- రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తయారు చేయాలి
- ఆడబిడ్డలకు వెయ్యి బస్సులు కొనిచ్చి ఆర్టీసీకి అద్దెకు ఇస్తాం
- చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు వస్తున్నాయి
- ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మహిళలు సాధికారత సాధించే వరకు, తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించడంలో భాగస్వాములయ్యే వరకు ప్రజా ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా ఉంటుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారు భరోసా ఇచ్చారు. మహిళలు వారి కాళ్ల మీద వారు నిలబడేలా, ఆర్థికంగా నిలబెడుతూ వ్యాపార రంగంలో నిలదొక్కుకునేలా.. రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేసే వరకు విశ్రమించమని స్పష్టం చేశారు.

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో స్వయం సహాయక సంఘాల "ఇందిరా మహిళా శక్తి" భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి మహిళల ఆర్థిక తోడ్పాటు కోసం పలు వరాలను ప్రకటించారు. ఆడబిడ్డలందరికీ ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రసంగించిన ముఖ్యమంత్రి..మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేపట్టిన, చేపట్టబోయే కార్యక్రమాలను విశదీకరించారు.

"రాబోయే రోజుల్లో మహిళా సంఘాలకు రైస్ మిల్లులు పెట్టించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేసుకోవడానికి గోడౌన్లను కట్టించడం, ఆ వద్దనే మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.ప్రభుత్వమే స్థలం ఇస్తుంది. ప్రభుత్వమే రుణాలు ఇప్పిస్తుంది. మీరే గోడౌన్లు కట్టండి. మీరే రైసు మిల్లులు పెట్టండి. మీకు అండగా ప్రభుత్వం నిలబడుతుంది. మిమ్మల్ని వ్యాపారస్తులుగా నిలబెడతాం. మీ కాళ్ల మీద మీరు నిలబడాలి. ఆర్థికంగా నిలదొక్కుకోవాలి. రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తయారు చేయాలి. ఆడబిడ్డలు ఎదిగితేనే అది సాధ్యపడుతుంది.

మహిళా సంఘాల్లో ప్రస్తుతం ఉన్న 65 లక్షల సభ్యుల నుంచి కోటి మందిని చేర్పించాలి. అందుకు కొన్ని నిబంధనలు అడ్డొస్తున్నాయంటే వాటిని సడలించాం. సభ్యత్వం చేరడానికి కనిష్ఠ వయో పరిమితిని 18 నుంచి 15 ఏళ్లకు తగ్గించాం. సభ్యత్వం పూర్తి కావడానికి గరిష్ఠ పరిమితిని 60 నుంచి 65 ఏళ్లకు పెంచాం. ఎవరికో లీజుకు ఇవ్వడంకన్నా ఆడబిడ్డలకు వెయ్యి బస్సులు కొనిచ్చి ఆర్టీసీకి అద్దెకు ఇస్తాం. ఇప్పుడే 150 బస్సులను ప్రారంభించాం. రాబోయే రోజుల్లో 1000 ఎలక్ట్రిక్ బస్సులకు ఆడబిడ్డలు యజమానులు కాబోతున్నారు. తద్వారా ప్రతి నెలా లక్ష రూపాయలు సంపాదించుకునే అవకాశం లభిస్తుంది.

చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు వస్తున్నాయి. రాబోయే ఎన్నికల్లో 33 శాతం మంది ఆడబిడ్డలు ఎమ్మెల్యేలు, ఎంపీలు కాబోతున్నారు. మీలో నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోండి. సమాజ సేవ చేయాలన్న ఆలోచనతో ముందుకు రావాలి.

ఆదిలాబాద్ గిరిజన కళా రూపాలు, నిర్మల్ బొమ్మలు, తినుబండారాలు... ఏవైనా కావొచ్చు స్వయం సహాయ సంఘాలు చేసే ఉత్పత్తులను కార్పొరేట్ కంపెనీలతో పోటీ పడుతూ అంతర్జాతీయంగా మార్కెటింగ్ చేసుకోవడానికి వీలుగా శిల్పారామం పక్కన 150 షాపులు కేటాయించాం. రాబోయే రోజుల్లో మీ ఉత్పత్తులపై పన్నులేమైనా ఉంటే రాబోయే రోజుల్లో వాటిని మినహాయింపు ఇవ్వడానికి ప్రయత్నిస్తాం. 65 లక్షల మంది సంఘాల్లో ఉన్న వారి పిల్లలే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. అందుకే ఆ పాఠశాలల నిర్వహణను స్వయం సహాయక సంఘాలకు అప్పగించాం. అలాగే విద్యార్థినీ విద్యార్థులకు 1 కోటి 30 లక్షల పిల్లలకు బట్టలు కుట్టించే కార్యక్రమం ఆడబిడ్డలకు అప్పగించాం.

జిల్లా కేంద్రాల్లో మహిళా సంఘాలు ఉండాలన్న లక్ష్యంతో ప్రతి జిల్లాకు ఇందిరా మహిళా శక్తి భవనాలు ఉండాలని, ప్రతి జిల్లాకు 25 లక్షల రూపాయలు కేటాయిస్తున్నం. 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసి ప్రభుత్వానికి అందించే విధంగా ఒప్పందం చేశాం.గ్రామీణ ప్రాంతాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణను స్వయం సంఘాలకు అప్పగించాం. వారు నిర్వహించినప్పుడే ఆ పాఠశాలల పరిస్థితి మెరుగుపడుతాయని అప్పగించాం. రాష్ట్రంలో 1.30 కోట్ల స్కూల్ యూనిఫామ్స్ కుట్టించే పనులను కూడా మహిళా సంఘాలకే అప్పగించాం. కుట్టుకూలి గిట్టుబాటు కావాలన్న ఉద్దేశంతో ధరను 75 రూపాయలకు పెంచాం". అని ముఖ్యమంత్రి వివరించారు. అనంతరం ఇందిరా మహిళా శక్తి మిషన్ 2025 పాలసీని ముఖ్యమంత్రి గారు ఆవిష్కరించారు. ఇదే వేదికగా 2,82,552 సంఘాలకు సంబంధించి రూ. 22,794 వేల కోట్ల చెక్కును అందజేశారు. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబోయే సోలార్ ప్లాంట్స్‌కు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. బీమా పథకాల నిధులను విడుదల చేశారు.



## చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ ప్రపంచస్థాయి యూనివర్సిటీగా ఎదగాలి

- సీఎం రేవంత్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ ఉన్నతస్థాయి ప్రమాణాలతో ప్రపంచస్థాయి యూనివర్సిటీగా ఎదగాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. అత్యుత్తమ ప్రమాణాలతో యూనివర్సిటీలో హాస్టళ్లు, ఆడిటోరియం, క్రీడా మైదానం వంటి సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ప్రపంచ మహిళా దినోత్సవం రోజున హైదరాబాద్ కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం లో 535 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన భవనాల నిర్మాణానికి శంకుస్థాపన, చారిత్రాత్మక దర్బారు హాలు పునరుద్ధరణ పనులను ముఖ్యమంత్రి గారు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రిమాట్లాడుతూ, "ప్రపంచ మహిళా దినోత్సవం రోజున ఆడబిడ్డల నుంచి కోరుకుంటున్నది ఒక్కటే. మీరంతా జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలి. ఉన్నత విద్యలో రాణించాలి. విద్యలో రాణించినప్పుడే కుటుంబాలు బాగుపడుతాయి. ఉన్నత విద్యలో రాణిస్తారని ఆకాంక్షిస్తున్నా" అని అన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన పనులు అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణాలు పూర్తి కావాలని, అవసరమైతే ఇంకో వంద రెండు వందల కోట్లు కావాలన్నా నిధులు కేటాయిస్తాం. రెండు మూడేళ్లలో ఈ పనులన్నీ పూర్తి కావాలి. ఈ యూనివర్సిటీ ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫోర్డ్ లాంటి అంతర్జాతీయ యూనివర్సిటీలతో ఈ యూనివర్సిటీ పోటీ పడి రాణించాలని కోరారు. 1924 లో కేవలం ఏడుగురు విద్యార్థులతో ప్రారంభమైన మహిళా విద్యాలయం ఈరోజు దాదాపు 7 వేలకు చేరుకోవడమే కాకుండా ఒక యూనివర్సిటీగా రూపుదిద్దుకోవడం శుభపరిణామమని అన్నారు. గడీలకు, జమిందార్లకు వ్యతిరేకంగా పోరాటానికి, పౌరుషానికి ప్రతిరూపమైన చాకలి ఐలమ్మ పేరును వర్సిటీకి పెట్టుకోవడం సంతోషంగా ఉందన్నారు. చట్ట సభల్లో అడుగుపెట్టడానికి అందరూ నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని, అప్పుడే తెలంగాణ అభివృద్ధి పథంలో పయనిస్తుందని అన్నారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్ , అసదుద్దీన్ ఓవైసీ , పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నత విద్యా మండలి చైర్మన్, వర్సిటీ వైస్ చాన్సలర్ సూర్య ధనుంజయతో పాటు ఆయా యూనివర్సిటీల వైస్ చాన్సలర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి అంచనా వ్యయం రూ.18,772 కోట్లు

- ఆరాంఘర్ నుంచి శంషాబాద్ వరకు ఆరు లేన్ల హైవే పూర్తయింది
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 10 జాతీయ రహదారులను పూర్తి చేశామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. తెలంగాణ అభివృద్ధికి అన్ని విధాల కట్టుబడి ఉందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి, రూ.6,280 కోట్లతో 285 కి.మీ. కొత్త జాతీయ రహదారులను నిర్మించామని స్పష్టం చేశారు. ఇప్పటికే పూర్తయిన రోడ్లను త్వరలో ప్రారంభిస్తామని కిషన్ రెడ్డి ప్రకటించారు. ప్రారంభోత్సవానికి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ హాజరవుతారని ఆయన అన్నారు.


రేవంత్ సర్కార్ ప్రతిష్టాత్మక చేపట్టిన రీజినల్ రింగ్ రోడ్డు గురించి మంత్రి నితిన్ గడ్కరీతో చర్చించానని కిషన్ రెడ్డి అన్నారు. ఆర్థిక విషయంలో ఇంకా త్రిసభ్య ఒప్పందం కుదరలేదని కిషన్ రెడ్డి తెలిపారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి రూ.18,772 కోట్లు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారని%ా% దీనికి సంబంధించిన అంచనా వ్యయాన్ని ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేంద్ర కేబినెట్ నోట్ కూడా సిద్ధమవుతోందని కిషన్ రెడ్డి తెలిపారు.

ఆరాంఘర్ నుండి శంషాబాద్ వరకు ఆరు లేన్ల హైవే ఇప్పటికే పూర్తయిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లే వారికి సిగ్నల్ ఫ్రీ రోడ్డు కూడా పూర్తయిందని ఆయన అన్నారు. బిహెచ్ఇఎస్ ఫ్లైఓవర్ కూడా చివరి దశకు చేరుకుందని, వచ్చే నెలలో పూర్తవుతుందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. బిహెచ్ఇఎల్ ఫ్లైఓవర్ పూర్తయిన తర్వాత కూకట్‌పల్లి–పటాన్‌చెరు మధ్య ట్రాఫిక్ కంట్రోల్ అవుతుందని కిషన్ రెడ్డి తెలిపారు.

మిగితా 4వ పేజీలో

## చేసింది గోరంత చెప్పుకునేది కొండంత

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పి కోతలు కోసిన రేవంత్ రెడ్డి గారూ.. ఏడాదిన్నర పాలనలో మహిళలను చేసింది ఎడతెగని వంచనేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు మిగిలింది ఎడతెగని వేదనేనన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనల విడుదల చేశారు. "మహిళలను కోటీశ్వరులను కాదు, కనీసం లక్షాదికారులుగా చెయ్యని చేతగాని సర్కారు మీది. ఏడాదిన్నర పాలనలో మహిళలకు ఏం చేసారని నేడు వేడుకలు నిర్వహిస్తున్నారు ఏటా 20వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళలకు ఇస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. చేసింది గోరంత, చెప్పుకునేది కొండంత అన్నట్లుంది కాంగ్రెస్ తీరు.

డిసెంబర్ లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఇచ్చిన సమాధానం ప్రకారం, సుమారు రూ. 5 వేల కోట్ల వడ్డీ లేని రుణాల బకాయి ఉంది.బకాయిలే చెల్లించని కాంగ్రెస్ ప్రభుత్వం, ఐదేళ్లలో లక్ష కోట్ల రుణాలు ఎలా ఇస్తుంది? కాంగ్రెస్ ప్రభుత్వ తీరు వల్ల మహిళలు కోటీశ్వరులు కాదు, అప్పుల పాలయ్యే పరిస్థితి వచ్చింది. 'మహిళలకు ప్రతి నెలా రూ. 2500' ఇస్తామని ఆరు గ్యారెంటీల్లో మొట్ట మొదటి హామీగా చెప్పి ఏడాదిన్నరగా అమలు చేయని రేవంత్ సర్కారు, ఈరోజు ఇందిరా మహిళా శక్తి పేరిట వేడుకలు నిర్వహించడం సిగ్గుచేటు. మహాలక్ష్మి పథకం కింద రాష్ట్రంలోని ప్రతి మహిళకు బకాయి పడ్డ రూ. 37,500 ఎప్పుడు చెల్లిస్తారు? రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటితే, చేతలు మాత్రం గడప దాటవు అని మరోసారి నిరూపితమైంది. గ్యారెంటీలు, 420 హామీలు అని అన్ని వర్గాల ప్రజలను మోసం చేసినట్లే రేవంతు సర్కారు, మహిళలను దారుణంగా వంచించింది. ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, కేసీఆర్ గారు మహిళా సంక్షేమం, సాధికారత, స్వయం సమృద్ధి కోసం ప్రారంభించిన పథకాలకు మంగళం పాడారు.

ఇందిరమ్మ రాజ్యంలో... కేసీఆర్ కిట్టు బంద్ అయ్యింది, కసీఆర్ న్యూట్రీషన్ కిట్ బంద్ అయ్యింది, బతుకమ్మ చీరెలు బంద్ అయినయి ఆరోగ్య లక్ష్మి బంద్ అయ్యింది ఆరోగ్య మహిళ బంద్

మిగితా 4వ పేజీలో

# నేపాల్‌లో మూడు భూకంపాలు

**బలగం టీవీ, హైదరాబాద్**

నేపాల్‌ని మూడు భూకంపాలు శనివారం మధ్యాహ్నం తాకాయి. టిబెట్ సరిహద్దులోని నేపాల్ తూర్పు ప్రాంతాన్ని ఓ తీవ్ర భూకంపం తాకింది. ఆ తరువాత పశ్చిమ నేపాల్ ప్రాంతాన్ని రెండు తీవ్రత తక్కువ ఉన్న భూకంపాలు తాకాయి అని అధికారులు తెలిపారు. కాగా ఈ మూడు భూకంపాల వల్ల ఎలాంటి ప్రాణ హానీ సంభవించలేదని కూడా వారు స్పష్టం చేశారు. మధ్యాహ్నం 2.35కు 5.9 తీవ్రత భూకంపం రిక్టర్‌స్కేలుపై రికార్డు అయింది. కాగా భూకంప కేంద్రం టిబెట్‌లోని డింగే కౌంటీలో నమోదయింది. తూర్పు నేపాల్‌లోని తాప్లెజంగ్ జిల్లా ఉత్తరాన 140 కిమీ. దూరంలో ఈ భూకంప కేంద్రం నమోదయిందని జాతీయ భూకంప పర్యవేక్షణ, పరిశోధన కేంద్రం (ఎన్‌ఈఎంఆర్‌సి) పేర్కొంది. డింగే కౌంటీని చైనా వాళ్లు డింగ్రీ కౌంటీ అని పిలుస్తుంటారు. నేపాల్ అత్యంత చురుకైన టెక్టోనిక్ జోన్లలో ఒకటి. ఇది భూకంపాల హానీ కలిగిస్తుంటుంది. ఏ సంవత్సరంలోనైనా అనేక భూకంపాలకు ఇక్కడ ఆస్కారం ఉంటుంది.

# అభివృద్ధికి అడ్డుపడుతున్న కాంగ్రెస్

- **ఎంపీ ధర్మపురి అరవింద్**



**బలగం టీవీ, హైదరాబాద్**

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసే నవోదయ విద్యాలయాన్ని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిఅడ్డుకున్నాడని ఎంపీ ధర్మపురి అరవింద్ సంచలన ఆరోపనలు చేశారు. నిజామాబాద్ బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ. 100 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసే నవోదయ విద్యాలయానికి కేంద్రం ఆమోదం తెలిపిందని వెల్లడించారు. నిజామాబాద్ రూరల్ పరిధిలో నవోదయ విద్యాలయం ఏర్పాటుకు స్థలం ఉన్నప్పటికీ, దాన్ని కాదని వివాదాల్లో ఉన్న బోధన్ షుగర్ ఫ్యాక్టరీ స్థలాన్ని నవోదయ విద్యాలయం ఏర్పాటుకు అనుకూలంగా ఉందని చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. జక్రాన్‌పల్లి మండలం కలిగోట్ గ్రామ పరిధిలో నవోదయ విద్యాలయం ఏర్పాటుకు స్థలం అనుకూలంగా ఉందని వెల్లడించారు. ప్రైవేటు భూములైన నిజాంషుగర్ ఫ్యాక్టరీ భూములను నవోదయ విద్యాలయానికి ఎలా ఇస్తారని ఎంపీ ప్రశ్నించారు. కాంగ్రెస్ వాదనలను పరిశీలిస్తే నిజాంషుగర్ ఫ్యాక్టరీ తెరిచే ఉద్దేశం కాంగ్రెస్ వారికి లేదా అని అనుమానం వ్యక్తం చేశారు. మద్యం వ్యాపారంలో కొనసాగుతున్న సుదర్శన్ రెడ్డి నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరవకొండ చేసి సొంతంగా ఇథనల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు పనులు చేయరు.. చేసేవాళ్లను చెయ్యనివ్వరని అన్నారు. ఈ సమావేశంలో పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.




## ఘనంగా ఉమెన్స్ డే వేడుకలు...

**బలగం టీవీ , సిరిసిల్ల**

అంతర్జాతీయ ఉమెన్స్ డే వేడుకలను శనివారం సిరిసిల్ల పట్టణంలోసేవా భారతీయ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా సెస్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వనజ , డాక్టర్ శ్రీమతి లీలా శిరీష హాజరై మాట్లాడుతూ స్త్రీలు అన్ని రంగాల్లో ముందుంటున్నారని అన్నారు.మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. మహిళలు ఒకవైపు కుటుంబం మరోవైపు ఉద్యోగ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా మహిళలు రాణించాలని పిలుపునిచ్చారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని అవమానపరిచిన దుండగులను కఠినంగా శిక్షించాలి

**బలగం టీవీ, బోయినిపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని నగరూరు గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి కొందరు గుర్తుతెలియని దుండగులు చెప్పులదండ వేసిన ఘటనపై బోయినిపల్లి మండల మాజి అంబెద్కర్ సంఘం అద్యక్షులు మళ్ళారపు చందు ఒక ప్రకటనలో తీవ్రంగా మండిపడ్డారు. భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి చెప్పులదండ వేసి అవమానించిన గుర్తుతెలియని దుండగులను గుర్తించి,వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రల పర్యవేక్షణ కరువైందని, తక్షణమే సీఎం రేవంత్ రెడ్డి స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, లేని ఎడల రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని డిమాండ్ చేశారు.

# వరంగల్‌లో రింగ్ రోడ్డుకు కేంద్ర మంత్రి హామీ

- **రాష్ట్ర మంత్రి కోమిటిరెడ్డి వెంకటరెడ్డి**
- **పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలి**
- **కేంద్రమంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు మంత్రులు వినతి**



**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని కోరారు. కాజీపేట కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.మహబూబ్ నగర్ జిల్లా దివిటిపల్లిలో జరిగే కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన కేంద్రమంత్రిని శంషా బాద్ విమానాశ్రయంలో రాష్ట్ర మంత్రులు కలిశారు. దాదాపు అరగంట సేపు రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులపై చర్చించారు. మంత్రుల విజ్ఞప్తిపై అశ్విన్ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు.

అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ఎంపీ కడియం కావ్య విజ్ఞప్తి మేరకు వరంగల్ కు రింగ్ రోడ్డు ఇస్తామని మంత్రి ఒప్పుకున్నారని చెప్పారు. కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని కోరినట్టు చెప్పారు. వికారాబాద్ రైల్వేలైన్ పెండింగ్ లో ఉందని, డోర్నకల్%-భద్రాచలం రైల్వే లైన్ పెండింగ్ లో ఉందని చెప్పారు. నస్కల్-హసన్ పర్తి- చింతలపల్లి లైన్ గురించి అడిగామన్నారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వరంగల్ ను అభివృద్ధి చేస్తామని మాటలతో కోటలు కట్టింది తప్ప పని చేయలేదన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. దశాబ్దాల కాలంగా పెండింగ్లో ఉన్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ రైల్వే డివిజన్ సహా తదితర అంశాలపై విజ్ఞప్తి చేశామని చెప్పారు. బీజేపీ తరపున కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరారు. వరంగల్ లో ఎయిర్ పోర్టు అందుబాటులోకి వస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందని చెప్పారు.

ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు. రైల్వే డివిజన్ గా మార్చాలన్న అంశాన్నీ ప్రస్తావించామని ఆమె చెప్పారు. కాకతీయ టెక్స్టైల్ పార్కుకు కావలసిన విధంగా రైలు మార్గాలను ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. వరంగల్ ఎయిర్పోర్ట్ ,టెక్స్టైల్ ఇండస్ట్రీ మధ్య కావలసిన రైల్వే లైన్ పై పార్లమెంటు సమావేశాల్లో చర్చించనున్నట్టు కావ్య చెప్పారు.




## ఎస్పీగా గిటే మహేష్ బాబాసాహెబ్ బాధ్యతలు

**-2020 ఐపీఎస్ బ్యాచ్ కు చెందిన అధికారి.**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటూ చట్ట పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కారం చేస్తూ ప్రజల భద్రత, రక్షణే ప్రధాన లక్ష్యమని ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన గిటే మహేష్ బాబాసాహెబ్ తెలియజేసారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లా ఎస్పీగా నియమించబడిన గిటే మహేష్ బాబాసాహెబ్ శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అఖిల్ మహాజన్ నుండి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ అధికారులు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలుసుకోని పుష్పాగుచ్చాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. అనంతరం ఎస్పీ మహేష్ బాబాసాహెబ్ మాట్లాడుతూ జిల్లా పరిధిలోని సామ్యాసుడిని దృష్టిలో పెట్టికోని వారికి భరోసా కలిగించే విధంగా పోలీసింగ్ వుంటుందని, శాంతి భద్రతల విషయంలోను కఠినంగా వుంటామని, ఎవరైన శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తప్పావని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.

## తెలంగాణ మహిళా కమిషన్‌ను ఆశ్రయించిన గాయని కల్పన

**బలగం టీవి, హైదరాబాద్**

సామాజిక మాధ్యమాలలో తనపై అసత్య ప్రచారం జరుగుతోందని, వాస్తవాలు తెలుసుకోకుండా పోస్టులు పెట్టడం నిరోధించాలని గాయని కల్పన తెలంగాణ మహిళా కమిషన్‌ను ఆశ్రయించారు. సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ఆపాలని ఆమె కోరారు. గాయని కల్పన ఇటీవల నిద్రమాత్రలను అధిక మోతాదులో తీసుకోవడం వల్ల అపస్మారక స్థితిలోకి వెళ్లారు. అయితే ఆమె భర్త, కూతురు కారణంగానే ఆత్మహత్యాయత్నం చేసిందని ప్రచారం జరిగింది. సోషల్ మీడియా, కొన్ని యూట్యూబ్ ఛానళ్ల వేదికగా కల్పన ఆరోగ్యంపై వివిధ రకాలుగా కథనాలు వస్తున్నాయి. ఆమె ఆత్మహత్యాయత్నం చేశారంటూ వార్తలు రావడంతో ఆమె మహిళా కమిషన్‌ను ఆశ్రయించారు. తనపై తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కమిషన్‌ను కోరారు.

## సీఎం రేవంత్‌కు మందకృష్ణ లేఖ

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ బహిరంగ లేఖ రాశారు. ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు రాష్ట్రంలో అన్ని రకాల ఉద్యోగ నియామక పరీక్షల ఫలితాలను నిలిపివేయాలని ఆ లేఖలో కోరారు. ఈ నెల 12వ తేదీ నుండి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ కోసం చట్టం చేస్తామని ప్రభుత్వం చెప్పిందని గుర్తు చేశారు. అంతలోనే గ్రూప్స్ ఫలితాల వెల్లడి తేదీలను ప్రకటించడం సరైంది కాదని ఆన్నారు. దీనివలన ఎస్సీలకు మళ్లీ అన్యాయం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

## ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణుల దాడి

**14 మంది మృతి**

**బలగం టీవి, హైదరాబాద్**

ఉక్రెయిన్ తూర్పు నగరమైన డోబ్రోపిలియా, ఖార్కివ్ ప్రాంతంలోని సెటిల్‌మెంట్లపైన రష్యా క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసింది. ఈ దాడుల్లో కనీసం 14 మంది చనిపోగా, ఐదుగురు బాలలు సహా 37 మంది గాయపడ్డారని శనివారం ఉక్రెయిన్ ఆంతరంగిక మంత్రిత్వ శాఖ తెలిపింది. అంతేకాక బహుళ అంతస్తుల భవనాలు, 30 వాహనాలు దెబ్బతిన్నాయని కూడా పేర్కొంది. 'ఈ దాడులతో రష్యా వైఖరి ఇప్పటికీ మారనట్లు కనిపిస్తోంది. మన జనులను మనం రక్షించుకోవాల్సి ఉంది. అందుకు మన వైమానిక రక్షణ శక్తిని పెంచుకోవాల్సి ఉంది .రష్యా మీద ఆంక్షలను పెంచాల్సి ఉంది. పుతిన్ ఆర్థిక బలాన్ని పెంచే ప్రతి దానిని దెబ్బతీయాల్సి ఉంది. అంతేకాక యుద్ధాన్ని అంతం చేయాల్సి ఉంది' అని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమీర్ జెలన్సీ ఫేస్‌బుక్ పోస్ట్‌లో పేర్కొన్నారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వీలయినంత త్వరగా ఆగాలని కోరుకుంటున్నారు.



# తలపున గోదారి-మన బతుకు ఎడారి

- నీళ్ళందక రైతన్నకు గోస
- చేతికొచ్చే పంటలు పశువుల పాలు
- ఉష్ణోగ్రత పెరిగి అడుగంటిన భూగర్భ జలాలు
- పశువులకు మేతగా మారుతున్న పంట పొలాలు



**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండలో కొన్ని పొలాలు నీరు లేక ఎడారిల తలపిస్తున్నాయి. తలపున నారాయణ పూర్ చెరువు, శ్రీ రాజరాజేశ్వర జలాశయంలు (మధ్య మానేర్) ఉన్న నారాయణపూర్ చెరువు నుండి ఇతర మండలాలకు సైతం నీరు వెళ్తున్నాయి. నారాయణపూర్ చెరువు నుండి బోయినిపల్లికి వచ్చే కాలువ ఇప్పటికీ వరకు కూడా పూర్తి కాకపోవడంతో రైతులు వేసిన పంట పొలాలు ఎండిపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గతంలో నారాయణపూర్ నుండి తడగొండ చెరువు నుండి బోయినిపల్లి చెరువు లోకి డి4 కాలువ ద్వారా నీరు వచ్చినప్పుడు పొలాలు పచ్చగా ఉండేవని, ప్రస్తుతం నీళ్ల రాకపోవడంతో తడగొండలో పొట్టకు వచ్చిన పొలాలు ఎండిపోవడంతో గొర్రెలకు, పశువులకు మేతగా మారుతున్నాయి. ఇప్పటికైనా నీళ్ల వదిలితే కొద్ది పంట అయిన చేతికి వస్తుందని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఎండిపోయిన పొలాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

## 9వ ప్యాకేజీ పనులు పూర్తి చేసే వరకు పోరాటం ఆగదు..

**- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి**
**-రైతులతో కలిసి రాయిని చెరువు పరిశీలన**



**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

కాళేశ్వరం ప్రాజెక్ట్ ను కట్టి 9వ ప్యాకేజి పనులను పూర్తి చేయకుండా 11వ ప్యాకేజీకు నిధులను తీసుకపోయిన ఘనత గత బిఆర్ఎస్ ప్రభుత్వానిదని,రాష్ట్ర ప్రభుత్వం 9వ ప్యాకేజీ పనులను పూర్తిచేసే వరకు పోరాటం ఆగదని బిజెపి జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. శనివారంవీర్నపల్లి మండలం ఉమ్మడి మద్దిమల్ల గ్రామంలో 9వ ప్యాకేజీ పనులు పూర్తికాక ఎండిపోయిన రాయిని చెరువును బిజెపి జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి రైతులు, నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ రాయిని చెరువు ఎండిపోవడంతో ఆయకట్టు యాసంగి పంట పొలాలు పూర్తిగా ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. కాలేశ్వరం ప్రాజెక్టును కట్టామని గొప్పలు చెప్పుకునే షాడో సీఎంగా పనిచేసిన స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ఒక్కసారి ఎండిపోయిన రాయిని చెరువును సందర్శించాలన్నారు. రైతులకు సాగునీరు అందించి దాహార్తి తీర్చేందుకు కాళేశ్వరం ప్రాజెక్టుని కట్టలేదని మా నీళ్లను సిద్దిపేటకు తరలించేందుకే ప్రాజెక్టులు కట్టారని అన్నారు . గత బిఆర్ఎస్ ప్రభుత్వం సిరిసిల్ల జిల్లా రైతాంగానికి న్యాయం చేయడానికి ప్రాజెక్టులు ఉపయోగపడడం లేదన్నారు. మల్కపేట రిజర్వాయర్ నుంచి రాయిని చెరువుకు రావలసిన పైప్లైన్ పనులను కంచర్ల అటవీ ప్రాంతంలో ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. రైతుల మీద చిత్తశుద్ధి ఉంటే గతంలోనే పెండింగ్ పనులను ఎందుకు పూర్తి చేయలేదని, రాయిని చెరువు భూములు మీ నాయకులకు సంబంధించినవని అందుకే పనులను ఆపారా అని ఎమ్మెల్యే కేటీఆర్ కు సవాల్ విసిరారు. రాయిని చెరువు నింపితే మండలంలోని అన్ని గ్రామాల్లో పంట పొలాలు సస్యశ్యామలమవుతాయన్నారు. పిసిసి అధ్యక్ష హోదాలో ఎల్లారెడ్డిపేటకు వచ్చిన రేవంత్ రెడ్డి 9వ ప్యాకేజి పనులు పూర్తి చేస్తామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం మీద ఐదు నెలలు గడుస్తున్నా పనులు ఎందుకు పూర్తి చేయడం లేదన్నారు. 9వ ప్యాకేజీ పనులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పూర్తి చేయకపోతే రాబోయే కాలంలో రైతులతో కలిసి భారతీయ జనతా పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు లక్పతి నాయక్, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి పిట్ల నాగరాజు, ఎల్లారెడ్డిపేట మండల ప్రధాన కార్యదర్శి చందుపట్ల లక్ష్మారెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు లక్ష్మీరాజం, దాసరి గణేష్, సందేవేని రాజు, సిరిసిల్ల వంశీ, లింబాద్రి, వెంకటేష్, శ్రీనివాస్, పిర్యా, మోహన్, తదితరులు పాల్గొన్నారు

## పారిశుధ్య కార్మికులకు ఘన సన్మానం...



**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ సఫాయి కార్మికులను బీఆర్ఎస్ మండల యువజన శాఖ నాయకులు చందనం శివరామకృష్ణ గ్రామపంచాయతీ ఆవరణంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....పరిధిలోని ప్రతినిత్యం ప్రజల బాగోగులకు గ్రామ పరిశుభ్రత పట్ల శ్రద్ధ వహిస్తూ వారి ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా,ప్రజల ఆరోగ్య రిత్యా పనిచేస్తున్న పట్టణ మహిళ కార్మిక సోదరిమణులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి సేవను గుర్తించి శాలువాతో సత్కరించి,వారికి గ్లౌజులు మాస్కులు అందించిన..ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ చైర్మన్ ఆకుల మురళీమోహన్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ యూత్ పట్టణ అధ్యక్షులు ధోనుకుల కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అబ్కారీ శాఖ అధికారుల సస్పెన్షన్...

**బలగం టీవీ , సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో చిత్ర రెస్టారెంట్ అండ్ బార్ సంబంధించి ప్రభుత్వ ఆదేశాలు, నియమ నిబంధనలు పాటించకుండా ట్రేడ్ లైసెన్స్ లేకుండానే 2 బి లైసెన్స్ రెన్యువల్ చేసి, క్రమశిక్షణ రాహిత్యంగా వ్యవహరిస్తూ జిల్లా యంత్రాంగానికి ఇబ్బందులు గురి చేసినందుకు గాను సిరిసిల్ల జిల్లా అబ్కారీ శాఖ అధికారి ఎస్. పంచాక్షరి, తప్పుడు వివరాలు నివేదికలను సమర్పించినందుకు గాను ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గులాం ముస్తఫా లను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



## మీ గుండాగిరికి బయపడేటోళ్ళం కాదు..

**-ప్రొద్దున లేచి ఎవరిని ముంచాలనీ ఆలోచించే మీరా నన్ను విమర్శించేది**
**- రెండు సార్లు సర్పంచ్ గా గెలిచినా.. నీవు వార్డు మెంబర్ గానైన గెలువు**
**-బీఆర్ఎస్ నాయకుడు మాట్ల మధు**

**బలగం టీవీ , తంగళ్ళపల్లి**

కేకే మహేందర్ రెడ్డి పెంపుడు గాళ్లు తనను,తన నాయకుడీని తిడితే ఊరుకుంటామా.. నీ అనుచరులకు తాగి పిచ్చి ఫోన్ లో బెదిరింపులకు పాల్పడుతే భయపడే ప్రసక్తే లేదు అని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మాట్ల మధు అన్నారు. తంగళ్ళపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల మాట్ల మధు మాట్లాడుతూ సాగు నీళ్ళు లేక రైతులు ఇబ్బంది పడుతుంటే మంత్రి, అధికారులతో మాట్లాడి రైతులకు అండగా నిలిచిన వ్యక్తి కేటీఆర్ అని అన్నారు. పోయినా సంవత్సరం రంగనాయక సాగర్ ద్వారా మండలానికి నీళ్ల ఇచ్చింది కేటీఆర్ అని,నువ్వే కదా ఒప్పుకుందని అన్నారు. ఐదుసార్లు ఓడిపోయాననే అక్కసుతో సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న వ్యక్తి కేకే మహేందర్ రెడ్డి అని అన్నారు. పార్టీకి సంబంధం లేని ఓ సామాన్య రైతు ను జైల్లో పెట్టించిన సంస్కృతి మీది అని అన్నారు. నీ లెక్క డబ్బులు తీసుకొని పోటీలో నిబడలే,వార్డు మెంబర్ గా గెలవని నువ్వా నా గురించి మాట్లాడేది,జడ్పీటీసీ టికెట్,పైసలు ఆశించి మా పార్టీలోకి వస్తానని చెప్పిన మాట మరిసినవ అని ప్రశ్నించారు.

మండేపల్లి గ్రామంలో భూమిని అక్రమంగా ఆక్రమించుకున్నది వాస్తవం కాదా అని అన్నారు. మా గ్రామంలో ఎవరికి వైద్య సహాయం కావాలన్నా వాళ్లకు అండగా ఉన్నా,నేను డాక్టర్ల దగ్గర కమిషన్ లు తీసుకుంటానని ఆరోపిస్తవా..నా ఉర్లోకి వచ్చి నిరూపించాలని అన్నారు. ఇసుక ట్రాక్టర్ల దగ్గర పైసలు తీసుకున్నాది మర్చినవ,ఇవ్వకపోతే కేసులు పెట్టిస్తనని దాదాగిరి చేసింది నువ్వు అని అన్నారు.నేను మాదిగ జాతి బిడ్డను,నువ్వేం కులమో చెప్పాలి,నువ్వు మనిషి వి కాదు,మతీభ్రమించి మాట్లడుతున్న మృగానివి అని అన్నారు.నా గ్రామానికి సేవ చేస్తా,జిల్లాకే నా గ్రామం తలమానికం,నా ప్రజలకు నా గ్రామానికి ఎల్లవేళలా సేవ చేస్తానని అన్నారు. నా ఊరు దేవాలయం నా ప్రజలలే దేవుళ్ళు,నా గ్రామాన్ని అభివృద్ధి చేసిన,నిలాగా దోచుకొని సంపాదించాలెఅని అన్నారు.యేండ్ల నుండి కబ్జాలో దున్నుకుంటున్న మా భూమిని నా భార్య పేరుమీద చట్టపరంగా చేసుకున్న,300 మందికి పట్టాలు ఇప్పించి, 50 మందికి ఇళ్ళ పట్టాలు ఇప్పిచ్చినా నీ లాగా దోచుకొని పని చేయలే అని అన్నారు.ఇన్ని రోజులు కేటీఆర్ సంకనాకి పనులు చేసుకుని,ఇప్పుడు తప్పుడు ఆరోపణలు చేస్తారా, ఉర్లల్లో కేకే మహేందర్ రెడ్డి,నువ్వు తిరిగే పరిస్థితి లేదని తరిమికొట్టే పరిస్థితి ఉందని అన్నారు. ప్రెస్ మిట్ కు వచ్చేటప్పుడు కేటీఆర్ ఫోటో చూసి రా మహేందర్ రెడ్డి,అప్పుడు మాట్లాడు 5 సార్లు కేటీఆర్ మీద పోటీ చేసి ఓడిపోయిన సిగ్గులేదా అని అన్నారు.ఈ కార్యక్రమంలో కుర్మా రాజయ్య, సావన పెళ్లి పర్శరాములు,సీలివెరీ చిరంజీవి, మీసాల కృష్ణ,గుండు ప్రేమ్ కుమార్,కొయ్యడ రమేష్,ఇమ్మనేని అమర్ రావు,బండి జగన్,ఆత్మకూరి చంటి యాదవ్,గుండి మహేష్ ముదిరాజ్,గోడిసేలా ఎల్లయ్య,కర్నె బాలయ్య, దొంతినేని చందర్ రావు,నర్రా సతీష్ రెడ్డి,మసీ పెద్దిశ్రీకాంత్ రావు,కృష్ణ రెడ్డి,కందుకూరు రామ గౌడ్,గోడిసేలా తిరుపతి,కడారి నవీన్ రెడ్డి, మాదారపు సత్తిరెడ్డి,నరేష్,పొన్నాలా చక్రపాణి, జీవన్, నరేందర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, ఒగ్గు లింఘం, పర్కపెల్లి తిరుపతి,బిక్షపతి, చెన్నామానేని రాజేశ్వర్ రావ్, సయ్యద్ అఫ్రోజ్ లు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

- ఎస్సై పృథ్వీధర్ గౌడ్




**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మర్లపేట గ్రామం వైపు శనివారం పెట్రోలింగ్ డ్యూటీ లో వెళ్లగా మర్లపేట గ్రామ శివారులో అక్రమంగా ఒక జెసిబి మరియు మూడు ట్రాక్టర్లతో ఎనిమిది మంది విలాసార గ్రామానికి చెందినవారు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్టు మండల ఎస్సై పృధ్వీధర్ గౌడ్ తెలిపారు. ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ యజమానులను, ట్రాక్టర్లను, జెసిబిని, అట్టి జెసిబి డ్రైవర్ ను పిఎస్ కు తీసుకువచ్చి కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే అట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అన్నారు.

# ఛాంపియన్ అయ్యేది ఎవ్వరు..?

- నేడు భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్
- మ. 2.30గంటల నుంచి

**బలగం టీవి, దుబాయ్**
**ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో ఆదివారం దుబాయ్ వేదికగా జరిగే ఫైనల్లో భారత్-న్యూజిలాండ్ తలపడనున్నాయి. ఈ టోర్నీలో వరుసగా నాలుగు విజయాలతో భారత్ ఫైనల్‌గా చేరగా టీమఇండియా చేతిలో తప్ప అన్ని మ్యాచ్‌ల్లో గెలిచిన కివీస్ తుదిపోరుకు సిద్ధమైంది.**



దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య ఆదివారం టైటిల్ సంగ్రామం జరగనుంది. లీగ్ దశలో అప్రతిహాత విజయాలతో ఫైనల్లో దూసుకొచ్చిన టీమిండియా.. ఆ క్రమంలోనే న్యూజిలాండ్‌పైనా విజయం సాధించింది. మరోవైపు న్యూజిలాండ్ జట్టు భారత్ చేతిలో ఓడినా.. లీగ్ దశలో రెండు మ్యాచుల్లో, సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాపై భారీ విజయాన్ని సొంతం చేసుకొని టైటిల్ పోరుకు సిద్ధమైంది. లీగ్ దశలో న్యూజిలాండ్‌ను చిత్తుచేసిన టీమిండియా అందుకు తగ్గట్లు వ్యూహాలు రచిస్తోంది. మెగాటోర్నీలో ఓటమి అన్నది ఎరుగకుండా అజేయంగా ఫైనల్లోకి దూసుకొచ్చిన రోహిత్‌సేన.. ఫైనల్లోనూ అదే ప్రదర్శనను కనబరిస్తే టైటిల్ కొట్టడం ఖాయం. ఐసిసి మెగా టోర్నీల్లో తమకు కొరకరాని కొయ్యగా మారిన కివీస్‌కు ఎలాగైనా ఈసారి చెక్ పెట్టాలని టీమిండియా ఆటగాళ్లంతా రెండ్రోజులు నెట్ ప్రాక్టీస్‌లో మునిగి తేలారు. బలబలాల పరంగా చూస్తే ఇరు జట్లు సమవుజ్జీలుగా కనిపిస్తున్నా.. ప్రస్తుతం టీమిండియా ఫామ్ చూస్తే బ్యాటింగ్, బౌలింగ్ పరంగా కివీస్ కంటే మెరుగ్గా ఉంది. బ్యాటింగ్‌లో కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, రాహుల్, రోహిత్, గిల్, హార్దిక్ వీరిలో ఏ ఒక్కరు నిలదొక్కుకున్నా.. మ్యాచ్ స్వరూపం మారడం ఖాయం. ఇక బౌలింగ్‌లో వరుణ్ చక్రవర్తి, మహ్మద్ షమీ అద్భుత ఫామ్ మనకు కలిసి రానుంది. ఇక కివీస్ విషయానికొస్తే.. రచిన్ రవీంద్ర, విలియమ్సన్ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. హెన్రీ గాయం జట్టును కలవరపెడుతోంది. 2002, 2013లో టైటిల్ విజేతగా నిలిచిన భారత్.. ముచ్చటగా మూడో ఛాంపియన్స్ ట్రోఫీపై కన్నేయగా.. 2000లో తొలిసారి టైటిల్‌ను చేజిక్కించుకున్న న్యూజిలాండ్ జట్టు రెండోసారి ఈ టైటిల్‌ను కైవసం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతోంది. గత నెల 19న న్యూజిలాండ్-పాకిస్తాన్ జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్‌తో ప్రారంభమైన 9వ చాంపియన్స్ ట్రోఫీ మార్చి 9న జరిగే మ్యాచ్‌తో ముగియనుంది.

### పిచ్ రిపోర్ట్

ఈ టోర్నమెంట్ మొత్తం దుబాయ్ పిచ్ స్పిన్నర్లకే అనుకూలించింది. ఇన్నింగ్స్ మొదట్లో పవర్‌ప్లే సమయంలో పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్నా.. ఆ తర్వాత మాత్రం బౌలర్లదే హవా నడుస్తోంది. బంతి పాతగా మారాక హిట్టింగ్ చేయడం బ్యాటర్లకు కష్టమవుతోంది.

# యూపీ వారియర్స్ విజయం

## మహిళల ప్రీమియర్ లీగ్ నుంచి ఆర్సీబీ అవుట్..!



**బలగం టీవి, హైదరాబాద్**

2025 మహిళల ప్రీమియర్ లీగ్ నుంచి డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిష్క్రమించింది. శనివారం యూపీ వారియర్స్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో ఆర్సీబీ 12 పరుగుల తేడాతో ఓడింది. తొలుత బ్యాటింగ్ చేసిన యూపీ 225 పరుగుల భారీ స్కోర్ సాధించింది. భారీ లక్ష్య ఛేదనలో ఆర్సీబీ 19.2 ఓవర్లలో 213 పరుగులకే ఆలౌటైంది. రిచా ఘోష్ (69 పరుగులు) హాఫ్ సెంచరీతో అదరగొట్టగా, చివర్లో స్నేహ్ రానా (26 పరుగులు) రాణించినా ఫలితం దక్కలేదు. యూపీ బౌలర్లలో సోఫీ, దీప్తి శర్మ చెరో 3, హెన్రీ 2, అంజలీ 1 వికెట్ దక్కించుకున్నారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన యూపీ 20 ఓవర్లలో 5 వికెట్లకు 225 పరుగులు చేసింది. జార్జియా వోల్ (99లి పరుగులు, 56 బంతుల్లో) సెంచరీకి ఒక్క పరుగు దూరంలో నిలిచిపోయింది. కిరణ్ నవగరే (46 పరుగులు), గ్రేస్ హరీస్ (39 పరుగులు) రాణించారు. ఆర్సీబీ బౌలర్లలో జార్జియా 2, చార్లీ డీన్ 1 వికెట్ దక్కించుకున్నారు. ఈ విజయంతో యూపీ క్వాలిఫైయర్ అవకాశాలు మెరుగుపర్చుకోగా, ఆర్సీబీ దాదాపు టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ టోర్నీలో ఆర్సీబీ ఇప్పటిదాకా 7 మ్యాచ్‌లు ఆడగా రెండింట్లో మాత్రమే నెగ్గి, ఐదింట్లో ఓడింది.



**స్వయం సహాయక సంఘాలకు అప్పగించిన 'ఇందిరా మహిళా శక్తి' బస్సులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారు లాంఛనంగా ప్రారంభించారు. స్వయం సహాయక సంఘాలకు తొలి విడతగా 150 బస్సులను అప్పగించి, వాటిని ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే ఈ వినూత్న కార్యక్రమాన్ని "ప్రపంచ మహిళా దినోత్సవం" రోజున శ్రీకారం చుట్టారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క గారు ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ ఎండీ గారితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.**



**రాష్ట్రంలోని స్వయం సహాయక మహిళా సంఘాలు స్వశక్తితో తయారు చేస్తున్న అనేక రకాల ఉత్పత్తులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి క్షుణ్ణంగా పరిశీలించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి స్టాళ్లను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క గారితో కలిసి ముఖ్యమంత్రి గారు సందర్శించారు. ఆయా ఉత్పత్తులను పరిశీలిస్తూ ముఖ్యమంత్రి గారు సంఘాల ప్రతినిధులతో మాట్లాడి వాటి తయారు చేసే విధానంతో పాటు ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు.**

# ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి అంచనా వ్యయం రూ.18,772 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

కాగా, పదేళ్లలో కేంద్రం ప్రభుత్వం తెలంగాణకు రూ.10 లక్షల కోట్లు ఖర్చు చేసిందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి చిత్తశుద్ధి, అంకితభావంతో కృషి చేస్తూనే ఉంటుందని కిషన్ రెడ్డి మరోసారి ఉద్ఘాటించారు.




# 'కోర్ట్' ట్రైలర్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

నాని నిర్మాణంలో వస్తున్న తాజా చిత్రం 'కోర్ట్: స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. ఈ సినిమాకు రామ్ జగదీశ్ దర్శకత్వం వహిస్తుండగా.. హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటిస్తున్నారు. ప్రియదర్శి, శివాజీ, సాయికుమార్, రోహిణి, హర్ష వర్ధన్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషించారు. యదార్థ సంఘటనల ఆధారంగా రాబోతున్న ఈ చిత్రం మార్చి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మూవీ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తుంటే.. కోర్ట్ డ్రామాగా రాబోతున్నట్లు తెలుస్తుంది. తన కూతురుని ప్రేమించాడన్న కారణంతో ఒక తండ్రి ఆ యువకుడిని జైలులో వేయించి బయటికి రాకుండా తన జీవితం నాశనం చేయాలనే కథతో ఈ సినిమా రాబోతుంది. న్యాయం కోసం సాగే పోరాటం అనే థీమ్‌తో రాబోతున్న ఈ ట్రైలర్ ఇంటెన్సివ్‌గా సాగింది.

# చేసింది గోరంత చెప్పుకునేది కొండంత

(మొదటి పేజీ తరువాయి)

అయ్యింది పింఛన్ల పెంపు బంద్ అయ్యింది కడుపు కోతలు మల్లా పెరిగినయి పెరిగిన క్రైం రేటుతో ఆడబిడ్డలకు భద్రత కరువైంది. నోటిఫికేషన్లు రాక, యువతుల ఉద్యోగ కలల సాకారం ప్రశ్నార్థకమైంది. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినవి అమలు చేయకుండా ఇన్నాళ్లూ కాలం వెల్లదీసారు. ఇప్పుడమో అన్నీ చేసినట్లు, మహిళలను కోటీశ్వరులను చేసినట్లు కోట్లు ఖర్చు చేసి ప్రచారం చేసుకుంటున్నారు. ఎన్నికలకు ముందు అరచేతిలో వైకుంఠం, అధికారంలోకి వచ్చాక అబద్దాలు ప్రచారం చేసుకుంటం అన్నట్లుంది కాంగ్రెస్ వైఖరి.మీ అభయహస్తం మేనిఫెస్టోలో చెప్పి, ఏడాదిన్నరగా మాట తప్పిన హామీలను గుర్తు చేస్తున్నాను.మహాలక్ష్మి కింద ప్రతి మహిళకు నెలకు రూ. 2500. ఇప్పటికీ అమలు లేదు. సంవత్సరానికి 20వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇస్తమన్నరు. అతీగతీ లేదు. 18 ఏళ్ళ పైబడి, చదువుకునే ప్రతీ యువతికి ఎలక్ట్రిక్ స్కూటర్ ఇస్తమన్నరు. ఊసే లేదు. ఆడబిడ్డ పెళ్లికి లక్ష ఆర్థిక సాయంతో పాటు, తులం బంగారం ఇస్తామన్నరు. జాడే లేదు. మహిళా పారిశ్రామికవేత్తల కోసం నైపుణ్య శిక్షణా కేంద్రంతో పాటు, ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తమన్నరు. పత్తాలేదు. డ్వాక్రా సంఘాలకు పక్కా భవనాలు నిర్మిస్తం అన్నరు. ప్రస్తావన లేదు. పుట్టిన ప్రతి ఆడ బిడ్డకు ఆర్థిక సాయంతో కూడిన 'బంగారు తల్లి' పథకాన్ని పునరుద్ధరిస్తం అన్నరు. పథకమే లేదు. అంగన్‌వాడీ టీచర్లకు నెలసరి వేతనం 18,000 లకు పెంచుతూ, ఇపిఎఫ్ పరిధిలోకి తెచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తం అన్నరు. ఆలోచనే లేదు. ఆశా వర్కర్లకు తక్షణమే వేతనాలు పెంచుతం అన్నరు. సోయి లేదు. ఇందులో ఒక్క హామీని అమలు చేయకుండా, నేడు వేడుకలు జరుపుకోవడం నవ్విపోదురు గాక నాకేంటి సిగ్గు అన్నట్లుంది" అని అన్నారు.

# నిమ్స్‌లో విజయవంతంగా గుండె మార్పిడి

(మొదటి పేజీ తరువాయి)

అతని కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకొచ్చారు. ఆ యువకుని బ్లడ్ గ్రూపునకు, అనిల్‌కుమార్ బ్లడ్ గ్రూప్ మ్యాచ్ అయ్యింది. దీంతో హార్ట్‌ను నిమ్స్‌కు తరలించి, డాక్టర్ అమరేశ్ బాబు నేతత్వంలోని టీమ్ అనిల్‌కుమార్‌కు అమర్చింది. ఆరోగ్యశ్రీ కింద అనిల్‌కుమార్‌కు ఉచితంగా అవయవమార్పిడి చికిత్స చేశామనీ, ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ భీరప్ప వివరించారు.

నిమ్స్‌లో గతేడాది 62 మందికి కిడ్నీ, నలుగురికి లివర్, ఇద్దరికి హార్ట్, ఒకరికి లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేశామని, ఈ ఏడాది 16 మందికి కిడ్నీ, ఒకిరికి లివర్, ఒకరికి హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలు చేశామని తెలిపారు. (2024, 2025లో కలిపి మొత్తం 87 ట్రాన్స్‌ప్లాంటేషన్లు) గతేడాది నిమ్స్‌లో ఒక వ్యక్తికి హార్ట్, లంగ్ రెండూ ఒకేసారి ట్రాన్స్‌ప్లాంట్ చేశామని నిమ్స్ డైరెక్టర్ భీరప్ప తెలిపారు. దేశంలోని ప్రభుత్వ దవాఖాన్లలో, ఒక్క నిమ్స్‌లో మాత్రమే ఇలా ఒకేసారి హార్ట్, లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసినట్టు ఆయన వివరించారు.

యువకుడికి విజయవంతంగా గుండె మార్పిడి చేసిన నిమ్స్ వైద్యులు, సిబ్బందికి మంత్రి దామోదర రాజనర్సింహ అభినందనలు తెలిపారు. అవయవమార్పిడి శస్త్రచికిత్స తర్వాత కూడా పేషెంట్ల బాగోగులను పర్యవేక్షించాలనీ, వారికి అవసరమైన వైద్య సేవలను కొనసాగించాలని ఆయన సూచించారు. నిమ్స్‌లో ట్రాన్స్‌ప్లాంటేషన్ సేవలను మరింత విస్తరించాలనీ, ఇందుకు అవసరమైన అన్ని వసతులను కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గాంధీ హాస్పిటల్‌లో త్వరలోనే అధునాతన ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. యువకుడికి గుండెను దానం చేసిన డోనర్ కుటుంబ సభ్యులను మంత్రి అభినందించారు. బ్రెయిన్ డెత్ కేసుల్లో అవయవదానానికి ముందుకొచ్చి, ప్రాణదాతలుగా నిలవాలని ప్రజలకు మంత్రి పిలుపునిచ్చారు. మరొకరికి ప్రాణం పోసే అవయవాలను మట్టిలో వథాగా కలిసిపోనియొద్దని కోరారు. అవయవదానం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలనీ, ఇందు కోసం అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని జీవన్‌దాన్ ఇన్‌చార్జి డాక్టర్ భూషణ్ రాజుకు మంత్రి సూచించారు. అవయవ మార్పిడిలో అవకతవకలకు పాల్పడే ప్రయివేటు హాస్పిటళ్లపై కఠిన చర్యలు ఉంటాయనీ మంత్రి హెచ్చరించారు. అవయవదానానికి కొత్త నిబంధనలను అమలు చేయబోతున్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. అవయవాల అక్రమ రవాణా, సేకరణ, మార్పిడికి కఠిన శిక్షలు పడేలా కొత్త నిబంధనలు ఉండబోతున్నాయన్నారు.

# వరి చివరి ఆయకట్టు వరకు సాగునీరు



## వ్యవసాయ శాఖ మంత్రి, నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**బలగం టీవి, హైదరాబాద్**

వేసవిలో తాగునీరు, వరి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంతో పని చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి, నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. శనివారం నల్లగొండ కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా తాగునీరు, ఇరిగేషన్, విద్యుత్ అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా, పంటలు ఎండిపోకుండా విద్యుత్ సరఫరా నిరంతరం కొనసాగే విధంగా సంబంధిత శాఖల సీనియర్ అధికారులు మొదలుకొని కిందిస్థాయి అధికారుల వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. మిషన్ భగీరథ అధికారులు ప్రజలకు తాగునీటి ఇబ్బంది ఏర్పడకుండా దృష్టి సారించాలని చెప్పారు. తక్షణం తాగునీటి సమస్యలను తీర్చేందుకు అవసరమైతే జిల్లా కలెక్టర్ల వద్ద నిధులు ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడి వెసులుబాటు కల్పిస్తామన్నారు. సీఎంతో చర్చించి శాసనసభ్యులకు ఎస్‌డిఎఫ్ కింద నిధులు ఇచ్చేలా చూస్తామని చెప్పారు. ఆయకట్టు చివరి వరకు సాగునీరు అందించి పంటలను కాపాడాలన్నారు. ఇంజినీరింగ్, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో నీటి సరఫరాపై పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విద్యుత్ అధికారులు విద్యుత్ సమస్యలు రాకుండా ఎల్లప్పుడూ క్షేత్రస్థాయిలోనే తిరిగి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

తక్షణం తాగునీటి అవసరాలకు జిల్లా కలెక్టర్ల వద్ద ప్రతి జిల్లాకూ కనీసం రూ.5 కోట్లు, నల్లగొండ జిల్లా విస్తీర్ణం పెద్దగా ఉన్నందున రూ.15 కోట్ల నిధులు ఉంచాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. అధికారులు ఎక్కడ తాగునీటి సమస్య ఉంటే అక్కడికి వెళ్లి వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఏఎంఆర్ ప్రాజెక్టు కింద కెనాల్ విస్తరణ, లైనింగ్ చేపడితే సమృద్ధిగా నీరు అందించొచ్చని, ఉదయ సముద్రం మేజర్ కెనాల్ పూర్తి చేసి చెరువులకు నీరు అందిస్తే సాగునీటి సమస్య రాదని చెప్పారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల కలెక్టర్లు ఇలా త్రిపాఠి, హనుమంతరావు, తేజస్ నందలాల్ పవార్, మిషన్ భగీరథ ఈఎన్‌సి కృపాకర్ రెడ్డి, ఇరిగేషన్ ఈఎన్‌సి హరిలాల్, ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ అజయ్ కుమార్, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అడిషనల్ కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, జయవీర్‌రెడ్డి, బాలునాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, ఉత్తమ్ పద్మావతి, వేముల వీరేశం, మందుల సామేల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీ కాలువలోకి దూసుకెళ్లిన కారు

**బలగం టీవి, హైదరాబాద్**

ఎస్సారెస్పీ కాల్వలోకి కారు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కుమారుడు మృతిచెందగా.. తండ్రి, కుమార్తె గల్లంతయ్యారు. కాల్వలో కొట్టుకుపోతున్న తల్లిని స్థానికులు కాపాడారు. వరంగల్ జిల్లా సంగెం మండలం తీగరాజుపల్లి వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. గల్లంతైన తండ్రి, కుమార్తె కోసం గాలింపు కొనసాగుతోంది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం మేచరాజుపల్లికి చెందిన సోమారపు ప్రవీణ్ తన భార్య కృష్ణవేణి, కుమార్తె చైత్ర సాయి, కుమారుడు ఆర్య వర్ధన్ సాయితో కలిసి హనుమకొండ నుంచి స్వగ్రామానికి కారులో బయలుదేరారు. ఈక్రమంలో మార్గమధ్యలో ఆయనకు గుండె నొప్పి వచ్చింది. దీంతో చికిత్స కోసం తిరిగి వరంగల్ వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా గుండె నొప్పి ఎక్కువై కారు అదుపు తప్పి ఎస్సారెస్పీ కాలువలో పడింది. స్థానికుల సాయంతో కృష్ణవేణి బయటపడింది. కుమారుడు మృతిచెందగా.. కారుతో సహా ప్రవీణ్, చైత్ర సాయి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. నీటిని అదుపులోకి తీసుకువచ్చి కారును, ప్రవీణ్ ఆచూకీ కనుక్కునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

## కేసీఆర్ అసెంబ్లీకి ఎప్పుడు వస్తారని మేము ఎదురుచూస్తున్నాం

### ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్**

కసిఆర్ అసెంబ్లీకి ఎప్పుడు వస్తా అని తాము కూడా ఎదురుచూస్తున్నామని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి కూర్చుంటే అన్ని సమస్యలకు పరిష్కారమవుతాయని ఆయన స్పష్టం చేశారు. ఏడు లక్షల కోట్ల అప్పు చేసింది మీరే కాబట్టి ఆ నిధులను ఏం చేశారో చెప్పాలని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కెసిఆర్‌ను ప్రజలు తరిమేశారని అయినా వారిలో మార్పురావడం లేదని ఆయన ఆరోపించారు. కెసిఆర్ మాటలకే అంకితమయ్యారని, ఆయనకు చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని ఎందుకు పెట్టలేదని ఆయన ప్రశ్నించారు. ఎంపి ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌కు గుండు సున్నా వచ్చిందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కనీసం పోటీ చేయలేదని ఆయన ఎద్దేవా చేశారు. కెసిఆర్ చేసిన తప్పులకు తాము మాటలు పడుతున్నామని, కాంట్రాక్టర్ల బిల్లులు పెండింగ్ పెట్టింది ఎవరని ఆయన ప్రశ్నించారు. వారు చేసిన కర్మల వల్ల తాము ఢిల్లీకి పోతున్నామని, కారు లోన్ కూడా 12 శాతానికి అప్పు తీసుకోలేదన్నారు. ఏలేటి మహేశ్వర్ రెడ్డి బిజెపిలో ఉనికి కోసం మాట్లాడుతున్నారన్నారు. ఆయన గురించి మాట్లాడుకోవాల్సిన అవసరం లేదని ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## 'ప్రధాని మోడీ డైరెక్షన్‌లోనే బీఆర్ఎస్'

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రధాని మోడీ డైరెక్షన్‌లోనే బిఆర్ఎస్ నడుచుకుంటుందని దీంతో ఆ పార్టీ స్థాయి దిగజారిపోయిందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ అన్నారు. ఆల్ పార్టీల ఎంపిల మీటింగ్‌కు హాజరు కాకపోవడంపై బిజెపి, బిఆర్ఎస్ పార్టీలపై ఫైర్ అవుతూ శనివారం ఓ వీడియోను ఆయన విడుదల చేశారు. అఖిలపక్ష ఎంపిల మీటింగ్‌కు రాకుండా తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం మీద ఊక దంపుడు ఉపన్యాసాలు ఇచ్చే బిజెపి, బిఆర్ఎస్ పార్టీల వ్యవహారం చూడాలని ఆయన ప్రజలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలపై అఖిలపక్షం పెట్టాలని బిజెపి, బిఆర్ఎస్‌లు డిమాండ్ చేశాయని వారి డిమాండ్ మేరకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తే ఆయా పార్టీల ఎంపిలు సమావేశానికి రాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వంపై బిజెపి, బిఆర్ఎస్‌లకు చిత్తశుద్ధి లేదన్నారు. కెసిఆర్ ప్రతిపక్ష పాత్ర వదిలేసి ఔట్ సోర్సింగ్‌లో అల్లునికి, కొడుక్కి ఈ పాత్ర ఇచ్చారని ఆయన సెటైర్లు వేశారు. రెండు పార్టీల డ్రామాలు రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, సమావేశాన్ని ఎందుకు బైకాట్ చేశారో తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు ఓట్లు తప్ప ప్రజా సమస్యలు పట్టవని ఆయన ఆరోపించారు. తెలంగాణ పథకాలు దేశవ్యాప్తంగా చర్చకు రావడంతో బిజెపి, బిఆర్ఎస్‌లకు మింగుడు పడటం లేదన్నారు. బిజెపి చేసే డ్రామాను బిఆర్ఎస్ వేస్తుందన్నారు. రెండు పార్టీల నాయకులు జలసీతో రాజకీయ కుట్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.




## సోనాక్షి సిన్హా 'జటాధర'

**బలగం టీవి, హైదరాబాద్**

బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా, టాలీవుడ్ ఎంట్రీకి రంగం సిద్ధమైంది. సుధీర్‌బాబు హీరోగా నటిస్తోన్న 'జటాధర' సినిమాతో నటిగా ఆమె తెలుగులోకి అడుగుపెడుతున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్రబృందం శనివారం స్పెషల్ పోస్టర్ విడుదల చేసింది. పాన్ ఇండియా మూవీగా ఈ చిత్రం సిద్ధమవుతోంది. వెంకట్ కల్యాణ్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రేరణ అరోరా సమర్పణలో సుధీర్‌బాబు ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మితమవుతోంది. 'శాస్త్రీయ, పౌరాణిక అంశాల మేళవింపుతో ఈ కథను రాశారు. ఈ రెండు జానర్స్‌కు చెందిన ప్రపంచాల్ని వెండితెరపై చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఓ సరికొత్త అనుభూతిని పొందుతారు' అని గతంలో ఈ ప్రాజెక్ట్‌ను ఉద్దేశించి సుధీర్ బాబు చెప్పారు.

## కొత్త తరహా ప్రేమ కథ "దిల్ రూబా"

కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా "దిల్ రూబా". ఈ సినిమాలో రుక్సర్ థిల్లాన్ హీరోయిన్ గా నటిస్తోంది. "దిల్ రూబా" చిత్రాన్ని శివమ్ సెల్యులాయిడ్స్, ప్రముఖ మ్యూజిక్ లేబుల్ సారెగమ తమ నిర్మాణ సంస్థ అయినటువంటి ఏ యూడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తున్నారు. "దిల్ రూబా" సినిమా ఈనెల 14న హోలీ పండుగ సందర్భంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఇంటర్వ్యూలో ఈ సినిమా హైలైట్స్ తెలిపారు దర్శకుడు విశ్వకరుణ్

కిరణ్ అబ్బవరం దిల్ రూబా మూవీకి ఇచ్చిన సపోర్ట్ ను మర్చిపోలేను.క మూవీ సక్సెస్ తర్వాత మరింత గ్రాండియర్ గా దిల్ రూబాను తీసుకురావాలని అనుకున్నాం ఆ క్రమంలో కొన్నిమార్పులు చేశాం గానీ మూలకథలో ఎలాంటి ఛేంజెస్ చేయలేదు.తెలుగులో క్షమించమని అడగలేము గానీ సారీ మాత్రం ఈజీగా చెప్పేస్తాం. తన తప్పు లేనప్పుడు సారీ ఎందుకు చెప్పాలనుకుంటాడు హీరో. ఇలాంటి వ్యక్తిత్వం వల్ల తనతో ఉన్నవారికి ఇబ్బంది ఉండొచ్చు. దిల్ రూబాలో కిరణ్ గారు చేసిన సిద్ధు క్యారెక్టర్ కూడా తన వ్యక్తిత్వం విషయంలో కాంప్రమైజ్ కాడు. క్యారెక్టర్ ను నమ్ముకుంటాడు. దాని వల్ల అతని లైఫ్ లో ఇబ్బందులు వస్తాయి. ప్రేమించిన అమ్మాయితో విడిపోయిన తర్వాత ఆ లవర్ ను శత్రువులా చూస్తుంటారు. కానీ ప్రేమ కంటే ముందు వారి మధ్య ఉండేది స్నేహమే. అదే స్నేహాన్ని విడిపోయిన తర్వాత కూడా పంచవచ్చు. బాగున్నావా అని ఫోన్ చేసి మన ఎక్స్ లవర్ ను అడగటంలో తప్పులేదు. దిల్ రూబా కథలో ఇలాంటి ఎలిమెంట్స్ ఉంటాయి. ఇటీవల వచ్చిన డ్రాగన్ మూవీకి మా దిల్ రూబా కు సంబంధం లేదు. మా మూవీ ట్రీట్ మెంట్ వేరుగా ఉంటుంది. ప్రేమ కథలన్నీ ఒకటే మనం వాటిని తెరపై చూపించే విధానమే కొత్తగా ఉండాలి. అలాంటి కొత్త తరహా ప్రేమ కథను దిల్ రూబాలో చూస్తారు.

## ఉత్కంఠగా '23' టీజర్

**బలగం టీవి, హైదరాబాద్**




మల్లేశం, 8 ఏఎమ్ మెట్రో వంటి ప్రయోగాత్మక చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించిన దర్శకుడు రాజ్ రాచకొండ. ఇప్పుడు ఆయన దర్శకత్వంలో రాబోతున్న మరో సంచలన చిత్రం 23. మన సమాజంలో చట్టం అందరికీ సమానంగా వర్తిస్తుందా.! అనే ట్యాగ్‌లైన్‌తో ఈ సినిమా రాబోతుంది. తేజ, తన్మయ, ఝాన్సీ ప్రధాన పాత్రలు పోషిస్తుండగా.. రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా నిర్మాణంలో ఓ సినిమా రూపొందుతోంది. తెలుగుతో పాటు తమిళం, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కాబోతుంది. నేడు మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్.

## వాటర్ ట్యాంకర్ ఢీకొని బీటెక్ విద్యార్థి మృతి

**బలగం టీవి, హైదరాబాద్**

స్కూటీని వాటర్ ట్యాంకర్ బలంగా ఢీకొట్టడంతో బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు బీటెక్ విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లిలో జరిగింది. బాచుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా నసురాబాద్ మండలం బొప్పాసుపల్లి గ్రామానికి చెందిన కేతావత్ నాను(21), అతని స్నేహితులు విశ్వనాథ్, కార్తీక్ బాచుపల్లిలోని వీఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి కళాశాలలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నారు. శనివారం ఉదయం 7 గంటల సమయంలో ముగ్గురు కలిసి నగరంలోని బిర్లా మందిర్‌కు వెళ్లడానికి ప్రగతినగర్ సిగ్నల్ వద్ద హాస్టల్ నుంచి స్కూటీపై బయలుదేరారు. ప్రగతినగర్ కమాన్ సిగ్నల్‌కు సుమారు 100 మీటర్లకు ముందే వీరు వెళ్తున్న స్కూటీని వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన వాటర్ ట్యాంకర్ బలంగా ఢీకొట్టింది. దాంతో స్కూటీ చివరి భాగంలో కూర్చున్న నాను కుడివైపునకు పడిపోయాడు. అతని స్నేహితులు ఎడమవైపు పడిపోయారు. అయితే, నానుపై నుంచి ట్యాంకర్ వెనుక చక్రం వెళ్లడంతో తల భాగం చితికిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. అతని మిత్రులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న వాటర్ ట్యాంకర్ డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.